# ఒకనాటి కవితావైభవం
## - సంధ్య యెల్లాప్రగడ



**-16-**

## రంగనాథ రామాయణం – ఒక పరిశీలన

'ఉడతాభక్తి' గా అన్న మాట మన తెలుగువారికి తెలిసినదే. దాని గురించి చెప్పే కథ రామాయణంలో రామునికి ఉడత చేసిన బుడత సాయం. రాముడు దాని భక్తికి మెచ్చి దాన్ని చేతుల లోకి తీసుకోని నిమిరినాడట. అందుకే దానికి వంటిపై ఆ గీతలు అని చెబుతారు. ఆ కథ మనకు మూల రామాయణంలో కనపడదు. ఆ కథ ఉన్న రామాయణం "రంగనాథ రామాయణం".

తెలుగులో వచ్చిన రామాయణాలలో రంగనాథరామాయణం విశిష్ట స్థానంలో ఉన్నది. తెలుగులో వచ్చిన మొదటి రామాయణం కూడా ఇదే. ఇది గేయ రామాయణం. అంటే ద్విపద ఛందస్సులో ఉంది. దీని రచయిత వర్ధమానపురాధీశుడైన గోన బుద్ధ భూపతి. ఈయన పూర్వ రామాయణం రచించితే, వీరి కుమారులు కాచవిభుడు, విఠల రాజు ఉత్తర రామాయణం పూర్తి చేశారు. ఆలా పూర్తి రామాయణం తెలుగులోకి తీసుకు రాబడినది. ఇది మొత్తం 11వేల ద్విపదల కావ్యం.

క్రీ.శ. 1294 ప్రాంతంలో 'కదనప్రచండ, మీసరగండ గోనగన్నయ రెడ్డి వర్ధమానపురం పాలన చేస్తూ ఉండేవాడు. గోన వంశనికి చెందిన 11 శాసనాల ద్వారా గోన వంశచరిత్ర మనకు తెలుస్తుంది. వారి రాయచూరు శాసనం ద్వారా, ప్రజా రక్షణకై దుర్గం నిర్మించారని తెలుస్తుంది. ఆ దుర్గంలో రాజు కొలువుండేవాడు. ఆ సభలో పురాణజ్ఞులు, సుతులు, హితులు ఎందరో ఉంటే, వారితో రసగోష్ఠి చెల్లిస్తూ "రమణీయంగా తెలుగులో రామాయణ క్రమమొప్పగ చెప్పటానికి ఘనకావ్య శక్తి గలవాళ్ళెవరు ఈ భూమి మీద ఉన్నారు?" అని ప్రశ్నించాడు రాజు. (భూమి గవీంద్రులు భుదులున్ మెచ్చ రామాయణంబు పురాణ మార్గమున విరచింపు)

సభలోని వారు మీ కుమారుడు బుద్ధరాజు ఉన్నాడు కదా అని పలికితే – "భూమి మీద కవులు విభువులు మెచ్చుకునే రీతి రామాయణ పుణ్య కావ్యం నా పేర తెలుగులో చెప్పి ప్రఖ్యాతం చేయి" అని ఆనతినిచ్చినాడు.

బుద్ధారెడ్డి "మా తండ్రి విఠలక్ష్మీనాథ పేర శ్రీరామ చరిత మొప్పజెప్పెద..." అని పీఠికలో పేర్కొంటూ ఇట్లా అంటాడు...

"ఆది కవీశ్వరుండైన వాల్మీకి – యాదరంబున బుయులందరు మెచ్చ
జెప్పిన తెలుగున శ్రీరామచరిత్ర –మెప్పాచెప్పెద గాఢాభ్యుదయ మెట్లనిన! "

గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణం తెలుగులో మొదటి కుటుంబ కృతి. తండి ఆదేశం ప్రకారం కొడుకు మొదలుపెట్టాడు. మనుమలు ఉత్తర భాగం పూర్తిచేశారు. 'రంగనాథ రామాయణం' అన్న పేరు దీనికి రావటం విశేషం. బుద్ధారెడ్డి తాతలు తండ్రులు వర్తమానాపురం ఏలారు. వీరు కాకతీయులకు సామంతులు.

తెలుగు సాహిత్య చరిత్రలో బుద్ధారెడ్డి చరిత్ర అత్యంత అధికంగా లభిస్తున్నది. రాజు, కవి అయిన ఈయన ప్రతిభావంతుడు. సాహిత్య సమరాంగణ విభుడు. కృష్ణదేవరరాయలు, ప్రతాపరుద్రుడు తరువాత అంతటి రాజకవి.

రంగనాథరామాయణం ప్రజలలో బహు ప్రసిద్ధికెక్కిన కావ్యం. సమకాలీనంగా ప్రజలలో ఉన్న కథలను తీసుకొని, మూల రామాయణంలోకి చొప్పించి ఈ కావ్యం రాశాడు బుద్ధారెడ్డి. ఆ కథలు ఎంతగా ప్రజలలో హత్తుకుపోయినాయంటే, ఆ కథలు మూల రామాయణంలో లేవంటే తెలుగు ప్రజలు నమ్మరు. అలా ప్రజల లోనించి తీసుకున్న కథలను కలిపిన రామాయణం ఇది.

అలా కలిపిన ఘట్టాలు ; అహల్యా వృతాంతం, అహల్య కోసం ఇంద్రుడు కోడై కుశాడని చెప్పటం, అహల్య రాయిగా మారటం, రాముని పాద స్పర్శతో స్త్రీ గా మారటం, జంబుమాలి వృత్తాంతం, లక్ష్మణుడు పర్ణశాల చుట్టూ ఏడు గీతలు గీసి పోవటం, రావణుని ముందు హనుమంతుడు తోకను పెంచటం, రావణుడు విభీషణుడిని తన్నటం, కుంబకర్ణుడిని లేపితే, రామునితో యుద్ధం వద్దని తమ్ముడు చెప్పటం. తన మోక్షం కోసము రామునితో యుద్ధానికి వెడుతున్నానని రావణుడు పలకటం, సులోచన వృత్తాంతం మొదలైన విషయాలు బుద్ధకవి చేర్చి, మూలకథలో లేనివి రచించి, దేశీయతను చూపాడు.

బుద్ధకవి సందర్భానుసారంగా వర్ణనలు చేర్చాడు. సరళమైన శైలిని వాడాడు. కథను సుబోధకంగా చెప్పాడు. పాత్ర చిత్రణ, సంభాషణలు మనోహరంగా చిత్రీకరించాడు.

లభిస్తున్న ప్రతులలో వావిళ్ళ వారిది ప్రాచీనమైనది. రాయల్ కో వారిది కూడా ఉంది. ఇవి కాకుండా ఆరుద్ర తన సమగ్ర ఆంధ్రచరిత్రలో అపురూపమైన ప్రతుల గురించి వివరించారు.

అవి 1. కాగితం ప్రతి. 1844 నాటిది. వ్రాతప్రతి. అది 1890లో జి.ఇ.హే.దొర వద్ద గ్రంథాలయం వారు కొన్నారు.

2. తాళపత్ర ప్రతి. ఆకులు అరచేతులంత ఉన్నాయిట. శ్రీలంక కు చెందిన ముత్తుస్వామి అన్న తెలుగువారి పారాయణ గ్రంథం. ఇది 1517 కు చెందినది. కాండికి చెందిన ముత్తుస్వామి 1802 వరకూ ఉండేవాడు. దీనిని ముత్తుస్వామి సేవకుడు దాచి, ఒక దొరకు 1883లో అమ్మాడుట. మతగ్రంథాలు సేకరించే బ్రిటీష్ వారు దీనిని కొని గ్రంథాలయంలో ఉంచారు.

★★★

ఈ రచన ఎవరిదన్న వాదోపవాదాలు చాలా కాలం పండిత లోకంలో నడిచాయి.

ఆంధ్ర విశ్వ విద్యాలయం వారు కట్టమంచి రామలింగారెడ్డి గారి ఆధ్వర్యములో ప్రచరించిన ప్రతికి పింగళి లక్ష్మీకాంతం గారు పీఠిక వ్రాశారు. ఆ పీఠికలో "దీనిని విఠల రామాయణమణియో విఠలనాథ రామాయణమని గాని పేరుండతగును. అటుల లేదు. రంగనాథ రామాయణమని ఉన్నది. ఇట్లున్నది విట్టలు పేరునే వెళనించుటకే యగునెమొ మనమాలోచింపవలెయును.... విఠలుని పూర్తి పేరు 'పాండురంగ విఠలనాథుడై ఉండును' దీనికి ఉచ్చారణా సౌలభ్యం కొరకు రంగనాథ రామాయణం అని పేరు పెట్టి ఉండవచ్చు. నామైకదేశే నామగ్రహణం శాస్త్ర సమ్మెతమేగా ! " అని వివరించాడు.

ఇంకా వివరిస్తూ 'ఒక వేళ అది రంగనాథుడన్న కవి రచించి ఉన్నట్లైతే, పింగళి గారి ప్రకారం "అతని కీర్తి బుద్ధారెడ్డికి ధారపోయనేల? అప్పటికింకను రాజ్యమేలుతున్న విట్టలునికే అర్పించి ఉన్నతుడగును కదా? ఆ రాజు, ఆ కవిషయం తానె ఆశించక, కొడుకుకు దక్కింపనేల?" .

ఈ వాదాన్ని శిష్టా రామకృష్ణ శాస్త్రి ఖండించారు.

ఈ రామాయణానికి రంగనాథుదన్న నియోగి కవి రాసినాడని కందుకూరివారు

ఆలోచించారు. వారు తన ఆంధ్ర కవుల చరిత్రలో, రంగనాథుడు రచించిన రంగనాథ రామాయణం అని ఉటంకించారు.

మల్లంపల్లి సోమశేఖర శర్మ ఈ విషయం చర్చిస్తూ "బుద్ధ భూపతి కాలంలో గాని, అతని కుమారుల కాలంలో కానీ దీనికి రంగనాథ రామాయణం అని పేరు వచ్చి ఉండదు. తనపేరుతో ఉన్నప్పుడు రామాయణకర్త బుద్ధాక్ష్మనాథుడు కానీ, వారి కుమారులు కాని అంగీకరించరు కదా. తరువాత దీనికి ఎటులలో రంగనాథ రామాయణమని పేరు వచ్చినది. తంజావురులోని శరభోజి మహారాజు సరస్వతీ మహల్ లైబ్రరీ లో రంగనాథ రామాయణ ప్రతులున్నవి. ఆ లైబ్రరీలో పుస్తకాల ప్రతులకు పట్టికలో రామాయణమనే కలదు కానీ, రంగనాథరామాయణమని లేదు."

రాళ్ళపల్లి అనంతరామశర్మ కూడా ఇది మధ్యలో వచ్చిన పేరని నమ్మినారు. "మరి ఈ రంగనాథ రామాయణానికి పేరెవరు పెట్టిరి? కర్త కానీ, ఉత్తర రామయణం రాసిన బుద్ధా రెడ్డి కొడుకులు కానీ ఈ పేరు సూచించలేదు. వారే ఆ పేరు పెట్టినారన్న లక్ష్మి కాంతం గారన్న మాట నిరాధారం. వ్యవహారంలో అనుకూలమైనా ఎవ్వరో ఎక్కడో పెట్టి ఉండ రాదేమి? కాబట్టి దీనికి రంగనాథ రామాయణమన్న పేరు మధ్యలో వచ్చినా ఉండవచ్చు. ఇట్లు అనుకొనుటలో సాహసమేమియును లేదు..." అని తీర్మానించాడు.

ఇంత వాదోపవాదాలకు కారణమైన బుద్ధారెడ్డి సామాన్యుడు కాదు.

"సర్వజ్ఞుదనగుండు చతుర వర్తనుడు
సర్వ పురాణం విచార తత్పరుడు
కమనీయ బహు కళా గమవిచక్షణుడు
సుమనిషి పోషనోత్సుక సుఖోన్నతుడు
కవిసార్వభౌముడు కావికల్పతరువు
కవిలోక భోజుండు, కవిపురంధరుడు " – రంగనాథ రామాయణం 1–84

బుద్ధరాజుకు సర్వజ్ఞ బిరుదు ఉన్నది. బుద్ధరాజు కొలువులో రంగనాథుడు ఉన్నాడోలేదు తెలియదు. కానీ ఒక కథ ప్రచారంలో ఉన్నది. ఈ కథ 1914 ముందు ప్రచురించిన 'పురాణం నామ చంద్రికలో' ఉన్నది. భాస్కరుడు ఆశ్రయించిన రాజు వద్ద అతని బంధువు రంగనాథుడు రాజు ఆజ్ఞతో రామాయణం రచించెను. భాస్కర రామాయణం, రంగనాథ రామాయణం ఒకేసారి కొలువుకు తెచ్చారుట. రాజు కుడి చేత్తో రంగనాథ రామాయణం, ఎడమ చేత్తో భాస్కర రామాయణం స్వీకరించగా, భాస్కరుడు కొపగించి, తన రామాయణం ఎదురు వచ్చిన గుర్రం రౌతుకి ఇచ్చెనట. " ఈ కథ కట్టు కథ అని ఆచార్య శ్రీరామమూర్తి వివరించారు.

ఈ పూర్వ రామాయణంలో, ఉత్తర రామాయణంలోనూ కూడా శైలీ సమముగా ఉంటుంది. పెద్ద తేడాలు కనపడవు. కాబట్టి ఒక్కరే రాసి ఉండవచ్చని కొందరి అనుమానం.

బి ఎన్ శాస్త్రీ తన 'రెడ్డి రాజ్య సర్వసం' లో గోన వంశం గురించి, గోన బుద్దారెడ్డి గురించి వివరించాడు.

గోనబుడ్డి రెడ్డి కాకతీయ రాజ్య ఫశ్చిమ దిక్కున ఉన్న వర్తమాన రాజ్య శూరాగ్రేశ్వరుడు. నగరంలో శివాలయాలను ఉద్ధరించిన భక్తాగ్రేశ్వరుడు. శ్రీరామచంద్రుని అనుగ్రహంతో రంగనాథ రామాయణం రచించి చరిత్రలో సముచిత స్థానం ఆక్రమించుకున్నాడు".

ఇలా వివిధ గ్రంథాలలో ఈ రాయణం గురించి, రచించిన వారి గురించి వాదోపవాదాలు సాగినాయి. నా వ్యక్తిగత అభిప్రాయం ఇది గోనబుద్ధారెడ్డే రచించి ఉండవచ్చు. నిజంగా రంగనాథుడన్న కవి రచించి ఉంటే ఎక్కడో ఆ విషయం తెలిసేది. పైగా రాజు తన పేరున రాయించుకొని ఉంటే, పూర్తిగా తనపేరే పెట్టుకొని ఉండేవాడు. ఎందుకు కుమారులు ఉత్తరకాండను రచించినారని ఉంటుంది. ఇటు వంటివి ఆలోచిస్తే ఈ వాదాపవాదాలు అనవసరము.

ఇక ఈ కావ్యం లోని ద్విపదల కొస్తే,

బాలకాండలో 2493, అయోధ్యాకాండ1834, అరణ్యకాండ 1560, కిష్కింధాకాండ 1345, సుందరకాండ 1177, యుద్ధకాండ 8881.

అలాగే రాముడు అవతార పురుషుడని, భగవంతుడని వాల్మీకి రామాయణములో 'ఆత్మానాం మనుష్యం మన్యే' అని ధ్వని గర్భంగా ప్రకటించుకకున్నాడు తప్ప, ఎక్కడా తెలియపరచలేదు.

కానీ రంగనాథ రామాయణములో ఒకటి రెండు చోట్ల ప్రత్యక్షంగా రాముడు అవతారపురుషుడనే విషయం ప్రకటించబడింది.

విశ్వామిత్రుని వెంట పంపించటానికి వెనకాడుతున్న దశరథునితో రాముని గురించి విశ్వామిత్రుడు

అనఘ! రాముడు బాలుడనుబుద్ధి మాను
మనఘ! నీ పుత్రకుండను లోభముడుగు
క్రతుకర్త, క్రతుమూర్తి, క్రతుభాగభోక్త
యతడు లోకారుధ్యు ...డని ..అంటూ శ్రీరామ అవతార విశేషం వివరిస్తాడు.

అలాగే సీతాస్వయంవరమప్పుడు "ఆదివరహమై యువలీలగోట మేదినీ తలయెత్తి మెఱసిన నీకు
తనర నీ విల్లెంత తగనెక్కుపెట్టు" అని అవతార విశేషంబు గుర్తు చేస్తాడు.

సీతారాములతో ఉన్నప్పుడు నిద్రపోకుండా ఉంటానని లక్ష్మణుడు నియమము పెట్టుకున్నాడని ఇతర రామాయణాలలో ఉంది. కానీ ఇక్క డ రంగనాథరామాయణంలో శ్రీరామ పట్టాభిషేకము నాడు లక్ష్మణుడు ఫక్కున నవ్వాడని, అందరూ మనసులో రకరకాలుగా అనుకున్నారని, ఇన్నాళ్ళూ రాని నిద్ర ఆనాడు రావటమే కారణమని బుద్ధరాజు సూచించాడు.

రంగనాథ రామాయణము దేశీఛందములో పాడుకోవటానికి అనుకూలంగా ఉంటుంది. పాడుకోవటానికి, యక్షగానాలకు, తోలుబొమ్మలాటలకు ఉపయోగపడింది. కవితాధార ఆగకుండా సాగుతుంది.

హనుమంతుడు సీతను చూచి వచ్చిన తరువాత రామునితో విన్నవించుట

"శ్రీరామచంద్రుని సింహాసనంపు, చేరువనోలి యాసీనులైయుండ

వలనొప్ప తను పోయి వచ్చిన తెలుగు, తలకొని వినగోఱు ధరణీశు తలపు

హనుమంతుడెంతయు నాత్మలో నెఱిగి/ ఘనమైన భక్తితో కరములు మొగిచి

కమలాప్త కులనాథ కంటి వైదేహి/ ప్రమదాశిరోమణి పరమకల్యాణి

ధరణీశ మీ యాజ్ఞ తలమోచికొనుచు/ నరుదైన దేశంబులన్నియు వెదకి

చిరభక్తి సంపాతిచే త్రోవయెరిగి యరిగిసముద్రమేనవలీల దాటి...."

ఇలా అనర్గళంగా ధార సాగిపోతుంది. ఈ ద్విపదలో ప్రయోగించిన పదాలన్నీ వాడుకలో ఉన్నవి.

భారత జాతీయ కావ్యాన్ని ఆంధ్రుల సొమ్ము చేయటానికి బుద్ధరాజు యథాశక్తి సేవచేశాడు. అది ఉడతాభక్తి కాదు. కొండంత భక్తి. ఇలా తెలుగు ప్రజలు పాడుకోవటానికి హాయిగా ఉండేలా తెలుగునాట రాముని కథను యుగయుగాలు గానం చేయించిన బుద్ధకవి చిరస్మరణీయుడు.

Ref:

గోనబుద్ధారెడ్డి రంగనాథ రామాయణం – రాయల్ కో ప్రచరణ.

సమగ్ర ఆంధ్ర సాహిత్యం – ఆరుద్ర

ఆంధ్ర కవుల చరిత్రం – కందుకూరి వీరేశలింగం

గోనబుద్ధారెడ్డి రంగనాథరామాయణం పరిశీలన – ఈమని శివనాగిరెడ్డి.

తెలుగులో ద్విపదలు – డా. సుశీల

Comments